ఇందిరమ్మ ఇండ్లలో అవినీతి

మొదటిపేజీ తరువాయి...

శెట్పల్లిసంగారెడ్డి పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో రూ.62 లక్షల అవినీతి జరిగినట్టు నివేదించారు. డీఈఈ నివేదిక ఆధారంగా గృహనిర్మాణశాఖ ఈఈ చైతన్యకుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు గృహ నిర్మాణశాఖ అధికారులతోపాటు గ్రామ వాలంటీర్లపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసుపై విచారణ జరిపిన ఎల్లారెడ్డి కోర్టు మేజిస్ట్రేట్ హారిక బుధవారం తీర్పు వెలువరించారు. గృహ నిర్మాణ శాఖ ఏఈలు సంపత్‌కుమార్, బిక్‌లాల్‌తోపాటు గ్రామ వాలంటీర్లు వజ్రమ్మ, రాజమణిలకు మూడేండ్ల జైలుశిక్షతోపాటు రూ.10వేల చొప్పున జరిమానా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా ఆరు నెలలపాటు జైలుశిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చారు.

రంగనాయకా.. ఇదేమి గోస!

కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం చంద్లాపూర్‌లో నిర్మించిన రంగనాయకసాగర్ ప్రాజెక్టు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నీటితో కళకళలాడుతూ ఉండేది. రంగనాయకసాగర్ నుంచి నీటిని విడుదల చేస్తే.. చుట్టుపక్కల చెరువులు నిండడమే కాకుండా రైతులకు సాగునీరు అందేది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రంగనాయకసాగర్‌లోకి నీటిని విడుదల చేయకపోవడంతో ఇలా బండరాళ్లు తేలి కనిపిస్తున్నది. ప్రాజెక్టులో నీళ్లు లేకపోవడంతో సాగునీళ్లు వస్తాయో రావోనని రైతులు వరినాట్లు వేయడానికి ఆందోళన చెందుతున్నారు.

గాల్లో ప్రీలాంచ్ మేడలు!

- సానెస్టా ఇన్‌ఫ్రా సంస్థ వ్యవహారం బట్టబయలు
- రెరా నోటీసులతో వెలుగులోకి ఆసక్తికర అంశాలు
- ఒక సంస్థ అనుమతితో మరోసంస్థ పేరిట విక్రయాలు
- రెరా కదలికతో 'నమస్తే తెలంగాణ' పరిశోధనాత్మక కథనం

హైదరాబాద్ సిటీబ్యూరో, జూన్ 19 (నమస్తే తెలంగాణ): అందమైన బ్రోచర్లు.. అబ్బురపరిచే గ్రాఫిక్స్.. నిన్నటిదాకా ప్రీలాంచ్ అమ్మకాలకు ఇవే పునాదులు. ఇప్పుడు ప్రీలాంచ్ దందా వింత పోకడలు పోతున్నది. బ్రోచర్లు లేవు.. గ్రాఫిక్స్ అసలే లేవు.. కనీసం ప్రాజెక్టు పేరు కూడా ఉండదు. బహిరంగ ప్రచారమే కనిపించదు. కేవలం భూమి డాక్యుమెంట్ ఉంటుంది. అందమైన భవనాలు కడతామంటూ కేవలం ఫోన్లలోనే మార్కెటింగ్ జరుగుతుంది. రూ.కోట్లల్లో వ్యాపారం అవుతుంది. ఇదీ తాజాగా వెలుగులోకొచ్చిన నయా ప్రీలాంచ్ దందా. ఇప్పటికే తరచూ ప్రీలాంచ్ మోసాలతో అనేక నిర్మాణ సంస్థలు బోర్డులు తిప్పేసి కోట్లాది రూపాయలు కొల్లడొడుతున్న తరుణంలో నోటి మాటలతోనే ఆకాశహర్మ్యాలు నిర్మిస్తూ కోట్లు వసూలు చేస్తున్న బెంగళూరుకు చెందిన సానెస్టా ఇన్‌ఫ్రా వ్యవహారం తాజాగా బయటికొచ్చింది. రెరా రెండు రోజుల క్రితం గచ్చిబౌలిలోని ఆసంస్థతోపాటు కడ్తాల్‌లోని హస్తిన రియల్టీ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. దీనిపై 'నమస్తే తెలంగాణ' పరిశీలనలో పలు ఆసక్తికర అంశాలు వెలుగులోకి వచ్చాయి.

ఒకటే ఫ్లోర్.. ముగ్గురే ఉద్యోగులు..

బెంగళూరు చెందిన సానెస్టా ఇన్‌ఫ్రా రియల్ ఎస్టేట్ సంస్థ హైదరాబాద్ శివారు ప్రాంతమైన మోకిలలో సానెల్టా ఇన్ఫిటీ పేరుతో అపార్ట్‌మెంట్ ప్రాజెక్టు చేపడుతున్నామని మార్కెటింగ్ మొదలుపెట్టింది. గతానికి భిన్నంగా వ్యాపారం మొదలుపెట్టింది. మోకిలలో కేవలం ఐదెకరాల భూమి డాక్యుమెంట్లు మాత్రమే వారి వద్ద ఉన్నాయి. ప్రాజెక్టుకు పేరు పెట్టలేదు.. అనుమతుల కోసం ఒక్క డాక్యుమెంటు కూడా తయారు చేయలేదు. కేవలం గచ్చిబౌలిలో జయభేరి వ్యాలీ కాలనీలోని ఒక అపార్ట్‌మెంట్‌లో కార్యాలయాన్ని తెరిచారు. ముగ్గురే ఉద్యోగులు. అక్కడి నుంచి ఫోన్ల ద్వారా మార్కెటింగ్ మొదలుపెట్టారు. హెచ్ఎండీఏ, రెరా నుంచి అనుమతులే లేవు. కనీసం వాటికి బీజం కూడా వేయలేదు. ఫ్లాట్లను బుక్ చేసుకోవాలంటూ ఆశ చూపుతూ కోట్లాది రూపాయలు వసూలు చేస్తున్నారు. దీంతో వీళ్లు ఫోన్ చేసిన వారిలోనే ఒకరు ఈ మోసాన్ని గుర్తించి రెరాకు ఫిర్యాదు చేసినట్టు తెలుస్తున్నది. దీంతో రెరా వెంటనే స్పందించి సదరు సంస్థకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. రెరా చట్టం ప్రకారం మీపై ఎందుకు చర్యలు తీసుకోవద్దో సంజాయిషీ ఇవ్వాలంటూ వారంపాటు గడువు ఇచ్చింది. దీనిపై 'నమస్తే తెలంగాణ' సానెస్టా ఇన్‌ఫ్రా ప్రతినిధి శ్యామ్‌ని సంప్రదించింది. అనుమతుల కోసం హెచ్ఎండీఏకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉన్నదని, తమకు తెలిసిన వారికే ప్రాజెక్టు గురించి చెప్పామని, ఎలాంటి ప్రచారం చేయలేదని వివరణ ఇచ్చారు.

అనుమతి ఒకరిది.. అమ్మకం మరొకరిది..

నగరంలోనే కాదు.. శివారులోనూ వివిధ నిర్మాణ సంస్థలు మరో రకంగా టోకరా వేస్తూ నిబంధనలకు నీళ్లొదులుతున్నాయి. కడ్తాల్‌లో హస్తిన రియల్టీ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ బ్రిసా పేరుతో ఏర్పాటుచేసిన లేఅవుట్‌లో ఖాళీ స్థలాలను విక్రయిస్తున్నది. ఈ లేఅవుట్ అనుమతి ఒక కంపెనీ పేరున ఉంటే, అమ్మకాలను మరో కంపెనీ చేస్తున్నది. దీనికి తోడు లేఅవుట్ నంబర్ (ఎల్‌పీ) వచ్చిన తర్వాత ఆ ప్రాజెక్టు వివరాలను రెరాలో నమోదు చేయలేదని ఫిర్యాదులు రావడంతో రెరా అధికారులు ఆ సంస్థలకు షోకాజ్ నోటీసులు ఇచ్చారు. గ్రేటర్ హైదరాబాద్ చుట్టుపక్కల పదుల సంఖ్యలోనే రియల్ ఎస్టేట్ సంస్థలు ప్రీలాంచింగ్ ఆఫర్లతో అమ్మకాలు చేస్తూనే ఉన్నాయని, అప్రమత్తంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు.

ఒకే సంస్థపై 58 కేసులు

ప్రీ లాంచ్ ఆఫర్లు ప్రకటించి మోసం చేసిన సాహితీ ఇన్‌ఫ్రాపై ఇప్పటివరకు ఒకేసారి 58 కేసులు నమోదయ్యాయి. ఇటీవలే సాయి నిఖిత, భువనతేజ, ఈవీకే ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ లాంటి ఎన్నో రియల్ ఎస్టేట్ కంపెనీలపై హైదరాబాద్ సీసీఎస్‌లో కేసులు నమోదయ్యాయి. తక్కువ ధర ఆశ చూసి ప్రీ లాంచ్ ఆఫర్ల లోకి వెళ్లి ఎందరో మోసపోతున్నారు. దీంతో బాధితుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్నది. ప్రీ లాంచ్ ఆఫర్లు చట్టవిరుద్ధమైనా పట్టించుకునే వారు లేరు. ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలు నిద్రావస్థలో ఉన్నాయి. కేవలం సాహితీ ఇన్‌ఫ్రాలోనే సుమారు 2,500 మంది బాధితుల నుంచి వివిధ వెంచర్ల పేరుతో రూ.3 వేల కోట్ల వరకు సంస్థ నిర్వాహకుడు బూదాటి లక్ష్మీనారాయణ వసూలు చేసినట్టు కేసు నమోదైంది.

ప్రీలాంచ్ పేరుతో భారీ మోసం

- న్యాయం చేయాలంటూ సీసీఎస్ వద్ద బాధితుల ఆందోళన
- రూ.100 కోట్లకుపైగా వసూలు చేసిన జీఎస్సార్ సంస్థ

హైదరాబాద్ సిటీబ్యూరో, జూన్ 19 (నమస్తే తెలంగాణ): ప్రీ లాంచ్ పేరుతో కోట్లాది రూపాయలు వసూలు చేసి మోసం చేసిన సంస్థ నిర్వాహకులను వెంటనే అరెస్ట్ చేసి తమకు న్యాయం చేయాలంటూ పలువురు బాధితులు ఆందోళన వ్యక్తంచేశారు. బుధవారం బాధితులు సీసీఎస్ ఉన్నతాధికారులను కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఈవీకే ప్రాజెక్ట్స్, ఈవీకే అవాస, జీఎస్సార్ అవాస పేర్లతో శంకర్‌పల్లి మోకిలా, కొల్లూర్ ప్రాంతాల్లో అపార్టుమెంట్లు, విల్లాలు నిర్మిస్తున్నామంటూ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ గుంటుపల్లి శ్రీనివాస్‌రావు(జీఎస్సార్), డైరెక్టర్లు గుంటుపల్లి పద్మజ, వంశీకృష్ణ చౌదరి, ఇదిర, అనూష గుంటపల్లి, గుంటపల్లి సమంత సోషల్‌మీడియాతోపాటు వివిధ ప్రసార మాధ్యమాల్లో ప్రకటనలు ఇచ్చారు. వీటిని చూసిన పలువురు అడ్వాన్స్‌లు చెల్లించారు. సుమారు 11 ఎకరాల్లో ఆరు బ్లాక్‌లలో ఆకాశ హర్మ్యాలు, మరికొంత స్థలంలో విల్లాలు నిర్మిస్తామంటూ బ్రోచర్లు తయారు చేశారు. ఫ్లాటు, ఇండ్లు ఇలా ఉండబోతున్నాయంటూ గొప్పగా చెప్పారు. ఆ బ్రోచర్లు చూసిన బాధితులు నిజమని నమ్మేశారు. 2021లో అడ్వాన్స్‌లు తీసుకొని 2023 వరకు ప్రాజెక్ట్ పూర్తి చేసి కొనుగోలుదారులకు అప్పగిస్తానంటూ ఆనాడే హామీ ఇచ్చారు. ఇందులో కొందరు రూ.20 లక్షలు, మరికొంరు రూ.50 లక్షలు, ఇంకా కొందరు రూ.కోటికిపైగా చెల్లించి బుకింగ్ చేసుకున్నారు. సుమారు రూ.100 కోట్లకు పైగానే వసూలు చేశారు.

మూడేండ్లు దాటినా నిర్మాణాల్లేవ్!

ఇచ్చిన హామీ మేరకు మూడేండ్లు దాటినా నిర్మాణాలు ప్రారంభం కాకపోవడంతో యజమాని గుంటుపల్లి శ్రీనివాస్‌రావును నిలదీశారు. దీంతో ఇచ్చిన డబ్బు తిరిగి ఇచ్చేస్తానని కొందరికి, మరికొందరికి త్వరలో నిర్మాణాలు చేస్తానని చెప్పి నమ్మబలికాడు. మొదట జుబ్లీహిల్స్, ఆ తరువాత బంజారాహిల్స్, మాదాపూర్‌కు తన కార్యాలయాన్ని మార్చారు. కాలాయపన చేస్తుండటంతో నారాయణగూడకు చెందన ఇద్దరు బాధితులు జుబ్లీహిల్స్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు మే నెలలో కేసు నమోదు చేసి, ఆ కేసును సీసీఎస్‌కు బదిలీ చేశారు. పక్కా ప్లాన్‌తో శ్రీనివాస్‌రావు తమ ను మోసం చేస్తున్నాడని గుర్తించిన సుమారు 100 మంది బాధితులు బుధవారం సీసీఎస్ కార్యాలయానికి చేరుకున్నారు. ప్రీలాంచ్ పేరుతో మోసం చేశాడంటూ ఆందోళన వ్యక్తం చేశారు. శ్రీనివాస్‌రావును అరెస్ట్ చేయాలని, తమకు న్యాయం చేయాలని కోరారు.

రెప్పపాటు కూడా కరెంట్ కోతల్లేవ్

- రాష్ట్రం వద్ద మిగులు విద్యుత్తు అందుబాటులో
- బ్యాంకులు పేద, మధ్య తరగతికి వారికి రుణాలివ్వాలి
- బ్యాంకర్లతో భేటీలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

హైదరాబాద్, జూన్ 19(నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో రెప్పపాటు కూడా కరెంటు కోతలు లేవని, విద్యుత్తు మిగులు ఉన్నదని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. కొద్దిరోజుల్లోనే రాష్ట్రంలో కొత్త విద్యుత్తు విధానాన్ని అమలు చేయనున్నామని వివరించారు. నగరంలోని ఓ హోటల్‌లో బుధవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమావేశంలో మంత్రి మాట్లాడారు. వ్యవసాయానికి 24 గంటల పాటు ఉచిత విద్యుత్తును ఇస్తున్నామని, రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున పరిశ్రమలు వచ్చినా ఎలాంటి ఇబ్బంది లేకుండా విద్యుత్తు సరఫరా చేస్తామని భరోసా ఇచ్చారు. రుణాలు పెంచడంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని, రాష్ట్రంలో పెద్ద ఎత్తున రుణాలు ఇవ్వాలని, బ్యాంకులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు. రీజినల్ రింగ్ రోడ్డుతో రాష్ట్ర దశ మారబోతున్నదని తెలిపారు. కేవలం బడా పారిశ్రామికవేత్తలకే కాకుండా నిరుపేదలు, మధ్యతరగతి వర్గాలకు రుణాలు ఇచ్చేందుకు బ్యాంకర్లు ముందుకు రావాలని కోరారు. బ్యాంకర్లకు సామాజిక, మానవీయ కోణం ఉండాలని, లేనిపక్షంలో అభివృద్ధికి అటంకం ఏర్పడుతుందని అన్నారు.

చిన్న రైతులకు రుణాలు అందడం లేదు: మంత్రి తుమ్మల

వ్యవసాయరంగానికి సంబంధించి గత సంవత్సరం కన్నా రూ.13వేల కోట్ల రుణాలు అధికంగా మంజూరు చేసినప్పటికీ చిన్న, సన్నకారు రైతుల వాటా అనుకున్నంత మేర లేదని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. తెలంగాణలో 73.11 శాతం భూములు చిన్న, సన్న కారు రైతుల వద్దనే ఉన్నాయని, కాబట్టి వారికి ఎక్కువ మొత్తంలో రుణాలు అందించేలా చర్యలు తీసుకోవాని కోరారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు బ్యాంకులు రుణాలు చాలా తక్కువగా ఇస్తున్నాయని, ఈ రుణాలను పెంచాలన్నారు.

మద్యం తాగుతూ విధులు.. ఉద్యోగి తొలగింపు

హైదరాబాద్, జూన్ 19 (నమస్తే తెలంగాణ): మహబూబాబాద్ జిల్లాలో మద్యం తాగుతూ విధులు నిర్వహించిన ఘటనపై రవాణాశాఖ తీవ్రంగా స్పందించింది. రవాణా శాఖ కార్యాలయంలో బీరు తాగుతూ విధులు నిర్వహించిన ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి ఈ సురేశ్‌ను ఉద్యోగం నుంచి తొలగించడంతోపాటు అతడి పేరును బ్లాక్‌లిస్ట్‌లో చేర్చింది. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించినందుకు బాధ్యుడిగా జిల్లా ట్రాన్స్‌పోర్ట్ అధికారి, ఎంవీఐ ఎండీ గౌస్‌పాషాకు ఉన్నతాధికారులు చార్జ్ మెమో జారీ చేశారు. కార్యాలయంలోకి మద్యం తీసుకొచ్చిన ఇద్దరు ఆర్టీఏ ఏజెంట్లు మధు, సాధిక్‌తోపాటు సురేశ్‌పై కూడా పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనతో మహబూబాబాద్ రవాణాశాఖ కార్యాలయంలో మూడేండ్లుగా విధులు నిర్వహిస్తున్న వారందరినీ ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీలకు అప్పగిస్తూ రవాణాశాఖ కమిషనర్ డాక్టర్ బుద్ధప్రకాశ్ జ్యోతి ఆదేశాలు జారీ చేశారు.

కరెంటు లేదంటే కేసే!

మొదటిపేజీ తరువాయి...

ఫిర్యాదు చేస్తే ప్రశ్నించే హక్కులేదనే రీతిలో విద్యుత్తుశాఖ తీరు ఉన్నదని రేవతి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అంశంలోకి రాచకొండ పోలీసులు జోక్యం చేసుకోవడాన్ని 2రోజుల కిందట రేవతి ప్రశ్నించారు. విద్యుత్తు అంశంలో పోలీసుల జోక్యమేమిటని నిలదీశారు.

బుధవారం జరిగింది ఇదీ..

ఎక్స్‌లో కరెంటు కోతలపై పెద్ద ఎత్తున దుమారం రేగడంతో రాత్రికిరాత్రి ఈ అంశం మరో మలుపు తీసుకొన్నది. కోతలను ప్రస్తావించిన కృతిక వద్దకు లైన్ ఇన్‌స్పెక్టర్ వెళ్లి బెదిరింపులకు పాల్పడగా, జర్నలిస్టు రేవతి ప్రశ్నించడంతో సరూర్‌నగర్ డివిజన్ పరిధిలోని ఆటోనగర్ ఏఈ దిలీప్ రంగప్రవేశం చేశారు. తమ పరిధిలో విద్యుత్తు కోతలపై రేవతి అనే మహిళ ఎక్స్ వేదికగా దుష్ప్రచారం చేస్తున్నారని, ఆమె చెప్పినట్టు తమ పరిధిలో 7 గంటల విద్యుత్తు కోతలు లేవని, ఆమెపై చర్యలు తీసుకోవాలని ఏఈ ఎల్బీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు అర్ధరాత్రి 12.15 గంటలకు ఎల్బీనగర్ పోలీసులకు ఇవ్వటం గమనార్హం. ఇంకేముంది?! ఏఈ ఫిర్యాదు ఇచ్చిందే తడవుగా ఎల్బీనగర్ పోలీసులు జర్నలిస్టు రేవతిపై కేసు నమోదు చేశారు. ఐపీసీ 505, 66డీ–ఐటీ(ఏ) యాక్ట్–2008 కింద ఎఫ్ఐఆర్ (నంబరు 662/2024) నమోదు చేశారు.

ఏమిటీ సెక్షన్లు..

- ఐపీసీ 505– ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజల్లో అలజడి రేపేలా తప్పుడు ప్రకటనలు చేయటం–ఇందుకు మూడేండ్ల వరకు జైలుశిక్ష, జరిమానా విధించేవారు.
- **66డీ:** ఎలక్ట్రానిక్ పరికరాల ద్వారా మోసపూరిత కార్యకలాపాలకు పాల్పడటం–ఇందుకు మూడేండ్ల వరకు శిక్ష, లక్ష జరిమానా విధించే అవకాశముంది.

రాహుల్‌గాంధీ.. ఇదేనా మీడియా స్వేచ్ఛ?

తనపై కేసు నమోదైన విషయాన్ని రేవతి ఎక్స్ ద్వారా వెల్లడించారు. ప్రశ్నించినందుకు ఎఫ్ఐఆర్ రూపంలో నాకో బహుమానం అనే రీతిలో 'మై మెడల్ ఆఫ్ హానర్: ఎఫ్ఐఆర్' అని పోస్ట్ చేశారు. మహిళను వేధించిన తెలంగాణ పవర్ అండ్ కో వంటి అసలైన నేరస్థులను వదిలేసి తనపై కేసు నమోదు చేశారని ఎద్దేవా చేశారు. 'మీడియా స్వేచ్ఛ అంటే ఇదేనా రాహుల్? జర్నలిస్టుల గొంతు నొక్కాలని చూస్తున్నారా? ప్రజాస్వామ్యంపై నమ్మకం ఉంటే ఈ విషయంలో నాకు న్యాయం చేసి, పత్రిక స్వేచ్ఛను కాపాడండి. ఇలా కేసులు పెట్టుకుంటూ పోతే ప్రజలకు న్యాయం చేయాల్సిన మీడియాను ఎవరు కాపాడుతారు?' అంటూ మరోమారు విరుచుకుపడ్డారు. ఈ ట్వీట్‌ను రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీతోపాటు సీఎం రేవంత్‌రెడ్డి అకౌంట్లకు ట్యాగ్ చేశారు. రేవతిపై కేసు నమోదు చేయటంపై నెటిజన్లు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ప్రజా సమస్యలను ఎత్తిచూపితే కేసులు పెడతారా? అని ఆమెకు అండగా నిలిచారు. విద్యుత్తుశాఖ వివరణ ఇవ్వాల్సిన అంశంలో పోలీసులు ఎందుకు జోక్యం చేసుకుంటున్నారు? అని విరుచుకుపడ్డారు. ఒక మహిళా నెటిజన్ ఆవేదనతో.. సమస్య మీద పోస్టు చేస్తే ప్రభుత్వ ప్రతిష్ఠను దెబ్బతీయటం ఎలా అవుతుంది? ఏ తరహా ప్రజా పాలన ఇది? అని వారంతా నిలదీశారు.

రేవతిపై కేసు ఉపసంహరించుకోవాలి: టీజేఎఫ్

హైదరాబాద్, జూన్ 19 (నమస్తే తెలంగాణ): ప్రజాసమస్యలపై స్పందించడం జర్నలిస్టుల ప్రథమ కర్తవ్యమని, అలా ప్రశ్నించినవారిపై కేసులు పెట్టడమే ప్రభుత్వానికి అలవాటుగా మారిందని టీజేఎఫ్ నాయకుడు పల్లె రవికుమార్ ఆరోపించారు. ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా ఉంటూ సమస్యలకు పరిష్కారం చూపే దిశగా జర్నలిస్టులు ప్రయత్నం చేయటం జర్నలిజంలో భాగమని బుధవారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆ కోణంలోనే జర్నలిస్ట్ రేవతి విద్యుత్తు వినియోగదారు (మహిళ) సమస్యను ప్రస్తావించి, ఆ సమస్య తీవ్రతను సోషల్ మీడియా వేదికగా తెలియజేశారని వెల్లడించారు. సమస్యను గుర్తించి పరిష్కారించాల్సిందిపోయి జర్నలిస్ట్ రేవతిని టార్గెట్ చేయటం ఏమిటి? అని ప్రశ్నించారు. ఎత్తిచూపిన లోపాలను పరిష్కరించకుండా జర్నలిస్ట్ రేవతిపై కేసులు నమోదు చేయటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. తక్షణమే రేవతిపై కేసును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

కరెంట్ ఇవ్వని కంపెనీలకు కాసులు

ఉమ్మడి రాష్ట్రంలో ప్రభుత్వాల నిర్వాకం

గ్యాస్ ఆధారిత విద్యుత్తు ఉత్పత్తి సంస్థలతో పీపీఏలు

గుదిబండల్లా మారిన ఒప్పందాలు, కోర్టుల్లో వివాదాలు

రూ.6,393 కోట్లు చెల్లించాలంటున్న కంపెనీలు

ఇందులో తెలంగాణ వాటా రూ.3,445 కోట్లు

హైదరాబాద్, జూన్ 19 (నమస్తే తెలంగాణ): రాష్ట్రం ఉమ్మడిగా ఉన్నప్పుడు విద్యుత్తు విషయంలో పాలకులు ఘోర తప్పిదాలు చేశారు. అనేక తప్పుడు విధానాలను అనుసరించి ప్రజాధనాన్ని ఇష్టారీతిన ప్రైవేట్ కంపెనీలకు దోచిపెట్టారు. కరెంట్ ఇవ్వని కంపెనీలకు రూ.కోట్ల బిల్లులు కట్టమెట్టి విద్యుత్తు సంస్థలను గుల్ల చేశారు. ఈ పాపాల్లో అప్పటి టీడీపీ, కాంగ్రెస్ ప్రభుత్వాలకు సమాన వాటా ఉన్నది. అయినా ఇవేమీ పట్టని ప్రస్తుత కాంగ్రెస్ సర్కారు, ఆ పార్టీ నేతలు ఛత్తీస్‌గఢ్ విద్యుత్తు ఒప్పందం విషయంలో కోడి గుడ్డు మీద ఈకలు పీకినట్టు వ్యవహరిస్తూ ప్రజలను పూర్తిగా తప్పుదోవపట్టిస్తున్నారు. గ్యాస్ ఆధారిత విద్యుత్తు ఉత్పత్తి కంపెనీలతో గత ప్రభుత్వాలు 1996 నుంచి 2007 మధ్య కాలానికి 8 దీర్ఘకాలిక ఒప్పందాలు చేసుకున్నాయి. మొత్తం 2,494 మెగావాట్ల విద్యుత్తు కొనుగోలు కోసం జీవీకే ఇండస్ట్రీస్, స్పెక్ట్రమ్, లాంకో (కొండపల్లి), జీవీకే ఎక్స్‌టెన్షన్, గౌతమి పవర్, జీఎమ్మార్ వేమగిరి, కోనసీమ గ్యాస్ పవర్ లిమిటెడ్ కంపెనీలతో అప్పటి ఏపీ ఎస్ఈబీ, డిస్కంలు ఈ ఒప్పందాలను కుదుర్చుకున్నాయి. అప్పట్లో గ్యాస్ లభ్యత ఉన్నదా? లేదా? అని చూడకుండా, కనీసం స్క్రూటినీ కూడా చేయకుండా ఈ పీపీఏలను కుదుర్చుకున్నారు. పైన పేర్కొన్న కంపెనీలు ఫిక్స్‌డ్ కాస్ట్, ఫ్యూయల్ కాస్ట్, ఆల్టర్నేటివ్ ఫ్యూయల్ కాస్ట్ పేరిట ఏకంగా రూ.6,393 కోట్లు చెల్లించాలని ప్రభుత్వంతో పేచీకి దిగాయి. ఈ అంశం సుప్రీంకోర్టు వరకు వెళ్లింది. ఒకవేళ కోర్టు తీర్పు ప్రభుత్వానికి వ్యతిరేకంగా వస్తే తెలంగాణ ప్రభుత్వం, డిస్కంలు రూ.3,445 కోట్లు (53.89 శాతం) చెల్లించాల్సి ఉంటుంది. ఉమ్మడి రాష్ట్రంలో జరిగిన ఈ నిర్వాహకంపై ఎవరూ నోరు మెదపడం లేదు. తప్పు జరిగిందని చెప్పడం లేదు.

విద్యుత్తు తెచ్చినా నిందలు..

తెలంగాణ ఏర్పాటు తర్వాత బీఆర్ఎస్ సర్కారు ఛత్తీస్‌గఢ్ నుంచి విద్యుత్తును తీసుకొచ్చి రాష్ట్రాన్ని వెలుగులమయం చేయడాన్ని జీర్ణించుకోలేక కాంగ్రెస్ నేతలు ఇప్పుడు నిందలుమోపుతున్నారు. విచారణ కమిషన్ పేరిట విషబీజాలు నాటుతున్నారు. బీఆర్ఎస్ హయాంలో ఏదో తప్పిదం జరిగిపోయినట్టు, ఒక తప్పును ఒప్పని వందసార్లు అంటే ఒప్పే అవుతుందన్నట్టు విష ప్రచారం చేస్తున్నారు. వాస్తవానికి ఇది రెండు రాష్ట్ర ప్రభుత్వాల మధ్య కుదిరిన ఒప్పందం. దీనిలో భాగంగా ఛత్తీస్‌గఢ్ నుంచి తెలంగాణకు 17,996 మిలియన్ యూనిట్ల విద్యుత్తు సరఫరా అయ్యిందని సాక్షాత్తూ ప్రభుత్వ వర్గాలే అంగీకరిస్తున్నాయి. ఇలా అంగీకరిస్తూనే ఆ ఒప్పందం తెలంగాణకు భారమైందనడం, రెండు నాల్కల ధోరణితో వ్యవహరించడం కాంగ్రెస్ నేతలకే చెల్లింది. 'ఉల్టా చోర్ కొత్వాల్ కో డాంటే' అన్నట్టుగా వ్యవహరిస్తున్న రేవంత్‌రెడ్డి ప్రభుత్వం.. రాష్ట్రంలో వ్యవసాయానికి, ఇతర వినియోగదారులకు నాణ్యమైన కరెంట్ ఇవ్వలేకపోయింది. విద్యుత్తు కోతలను తెచ్చిపెట్టి, అంతర్గత సమస్యలంటూ కుంటిసాకులు చెప్తున్నది. రాష్ట్రంలో 90 లక్షల కుటుంబాలకు తెల్ల రేషన్‌కార్డులు ఉంటే 30 లక్షల కుటుంబాలకే 'గృహజ్యోతి' పథకాన్ని అమలు చేస్తున్నది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు, సబ్‌స్టేషన్ల ముట్టడి లాంటి నిరసనలు సర్వసాధారణమయ్యాయి. వీటి నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే కమిషన్ల పేరుతో రేవంత్ సర్కారు నాటకమాడుతున్నదని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

కేసీఆర్ రాసిన లేఖలో తప్పేముంది?

- ఉపముఖ్యమంత్రి భట్టివి అనాలోచిత వ్యాఖ్యలు
- జస్టిస్ నర్సింహారెడ్డి ఎందుకు ప్రెస్‌కాన్ఫరెన్స్ పెట్టారు?
- నిలదీసిన కాంగ్రెస్ నేత శరత్‌చంద్ర

హైదరాబాద్, జూన్ 19 (నమస్తే తెలంగాణ): విద్యుత్తు కొనుగోళ్లు, ప్లాంట్లపై ఏర్పాటుచేసిన జస్టిస్ నర్సింహారెడ్డికి మాజీ సీఎం కేసీఆర్ రాసిన లేఖలో తప్పేమున్నదని కాంగ్రెస్ పార్టీ నేత శరత్‌చంద్ర ప్రశ్నించారు. కేసీఆర్‌కు న్యాయ వ్యవస్థపై నమ్మకం లేనట్లుంది? అని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చేసిన వ్యాఖ్యలను ఆయన తప్పుబట్టారు. ఆ వ్యాఖ్యలు అనాలోచితమైనవి, అపరిపక్వమైనవి అని వ్యాఖ్యానించారు. న్యాయ వ్యవస్థ వేరు, జ్యుడీషియల్ కమిషన్లు వేరని వివరించారు. జస్టిస్ నర్సింహారెడ్డి ఇరుపక్షాల వాదనలు వినకముందే వితేకరుల సమావేశం నిర్వహించి తీర్పు వెల్లడించటం సరైంది కాదని అభిప్రాయపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ జ్యుడీషియల్ కమిషన్ వేసేముందు ఎవరిని సంప్రదించిందని ప్రశ్నించారు. జ్యుడీషియల్ కమిషన్ వేసేముందు ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం నిర్వహించి, వారి సలహాలు తీసుకోవాలని అన్నారు. ఈ అంశాన్ని కనీసం మంత్రివర్గంలోనైనా చర్చించారా? అని నిలదీశారు. ప్రభుత్వం వేసిన జ్యుడీషియల్ కమిషన్ కేవలం ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిషన్ (నిజ నిర్ధారణ కమిటీ) మాత్రమేనని అన్నారు. అవసరమైన సమాచారాన్ని తీసుకోవటం, వ్యక్తులను ఎగ్జామిన్ చేయటం, క్రాస్ ఎగ్జామినేషన్‌కు అనుమతి ఇవ్వటమే తప్ప న్యాయవ్యవస్థలో జస్టిస్ నర్సింహారెడ్డి భాగం కాదని స్పష్టంచేశారు. నిజనిర్ధారణ చేసే ప్రక్రియలో కమిషన్‌కు నేతృత్వం వహిస్తున్న న్యాయమూర్తికి సంయమనం ఉండాలని సూచించారు.

కమిషన్ చైర్మన్ మీడియాతో మాట్లాడొచ్చా?

కమిషన్‌కు చైర్మన్ తన విచారణ అంశాలను ముందుగానే ప్రిజుడిస్‌గా ముందే మాట్లాడొచ్చా? జస్టిస్ నర్సింహారెడ్డి ప్రెస్ కాన్ఫరెన్స్ పెట్టి తన అభిప్రాయాలను